

అంకిత భావంతో పనిచేద్దాం

రెవెన్యూ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని రెవెన్యూ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. - 8లో



ప్రతిశాఖలోనూ మహిళా కమిటీలు

ప్రతిశాఖలోనూ అంతర్గత మహిళా కమిటీలు ఏర్పాటు చేయాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అన్నారు. - 8లో



చార్జీల బాదుడు

తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో టోల్‌గేట్ పేరుతో ఆర్టీసీ బస్సుల్లో రూ.10 పెంచడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

యోగా డేను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్


తిరుపతి అర్బన్ : యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని తారక రామారావు స్టేడియంలో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. జిల్లాలో 6200 ప్రాంతాల్లో యోగా నిర్వహించడం జరుగుతోందని స్పష్టం చేశారు. యోగా పూర్తయిన తర్వాత ఉదయం 10 గంటలలోపే ఆ కార్యక్రమం ఫొటోలు , వీడియోలను యాప్ నందు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రజాప్రతినిధులందరూ పాల్గొనేలా ప్రత్యేకంగా సంబంధిత అధికారులు వారిని ఆహ్వానించాలని సూచించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో డొమెస్టిక్ డెటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు కార్యాలయ అధికారి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ ఎస్‌సీ ఉత్తీర్ణత ఆపైన విద్యార్హతలు కలిగి 18 ఏళ్ల వయస్సు నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న మహిళ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 390 గంటల కాల వ్యవధిగల ఈ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌తో పాటు మరిన్ని వివరాల కోసం 95338 89902 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్/కన్వీనర్ పి.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి జులై 15వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ''ఐటీఐ.ఏపి.జీటివి.ఇన్'' అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సమీపంలోని ఏదేని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో పరిశీలన చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు జులై 21, 22వ తేదీల్లో, 23 నుంచి 25వ తేదీల్లో ప్రైవేటు ఐటీఐలో ప్రవేశాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి అభ్యర్థులకు ఎటువంటి కాల్ లెటర్స్ పంపరని, పూర్తి వివరాలకు 94928 61369, 85000 21856, 94414 96103 నంబర్లలో సంప్రదించాలని కోరారు.





పోటుగనుమ వద్ద మామిడి చెట్లను నరికేస్తున్న రైతు నాగరాజు నాయుడు



కొత్తపల్లి మిట్ట వద్ద మామిడి పంటను బీడు భూమిలో పారేస్తున్న రైతు మనోహర్‌రెడ్డి

మామిడి రైతుకు గుండెకోత

మామిడి ధరలు జిల్లాలో రోజు రోజుకు పతనమవుతుండడంతో అన్నదాత గుండె తరుక్కుపోతోంది. కళ్ల ముందే కాయలు తోటల్లోనే రాలిపోతుంటే ఆశలు కూలిపోతున్నాయి. మండీలు, ర్యాంపుల వద్ద తోతాపురిని అడిగేవారే లేకపోవడంతో ట్రాక్టర్లలో తెచ్చిన మామిడిని నేలపాలు చేసి విలపిస్తున్నారు. ఈక్రమంలో కడుపు మండిన అన్నదాత తన చేత్తోనే గారాబంగా పెంచుకున్న మామిడి చెట్లను నిలువునా నరికివేస్తూ కన్నీరు కారుస్తున్నారు. రైతన్నను ఆదుకోని ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

- ధరలు లేక రైతులు విలవిల
- తోటలోనే వదిలేసిన మామిడి కాయలు
- బరువెక్కిన హృదయంతో చెట్లు నరికివేత
- ప్రకటనలకే పరిమితమైన కూటమి ప్రభుత్వ సాయం
- రాష్ట్ర మంత్రి వచ్చి వెళ్లిన తరువాత ర్యాంపులు మూసివేత
- ర్యాంపుల మూసివేతతో మరింత కష్టాల్లో అన్నదాతలు

తిరుపతి రూరల్ /పాకాల : మామిడి ధరలు పతనమవడంతో రైతులు విలవిలలాడుతున్నారు. కాయలు కోయకుండానే తోటల్లోనే వదిలేస్తున్నారు. కళ్ల ముందు కాయలు నేలరాలి కుళ్లిపోతుండడం చూసి తట్టుకోలేని కొందరు రైతులు నష్టపోతామని తెలిసినా కోత కోసి మండీల వద్దకు తీసుకొచ్చి నిరీక్షిస్తున్నారు. మరోవైపు ఫ్యాక్టరీల నుంచి అనుమతి రాక ఎగుమతి లేక మండీల వద్దకు చేరిన మామిడి అక్కడే మగ్గిపోతోంది. మామిడి రైతులు ఫ్యాక్టరీలకు వెళ్లలేక, మండీలకు చేరిన సరుకు పంపడానికి వీలు లేక రోడ్లపై పారేస్తున్నారు. ఆరుకాలం కష్టపడి పండించిన మామిడి పంటను కొనేవారు కరువవడంతో రైతు కంట కన్నీరు కారుతోంది. బరువెక్కిన హృదయంతో వెనుదిరిగి వెళుతున్న రైతులు ఈ ప్రభుత్వంలో బతకలేమని మామిడి చెట్లను నరికివేస్తున్నారు.

జిల్లాల్లో అతిపెద్ద మ్యాంగో మార్కెట్ అయిన దామలచెరువులో సుమారు 150 వరకు మామిడి సేకరణకు అవసరమైన మండీలు ఉన్నాయి. మండీలతో పాటు 30 వరకు ర్యాంపులు ఏర్పాటు చేయడంతో చాలా మంది మామిడి వ్యాపారులు బయటి నుంచి వచ్చి ర్యాంపుల వద్ద లోడింగ్ చేసుకుని మామిడి పంటను కొనుగోలు చేసి వెళ్లేవారు. అదంతా గత ఏడాది. ఈ ఏడాది మామిడి పంట అధికం కావడం, ప్రభుత్వం అవసరమైన మేరకు ఫ్యాక్టరీలు తెరిపించలేకపోవడంతో మామిడి ధరలు పడిపోయాయి. ప్రధానంగా తోతాపురిని కొనేవారు లేక రోడ్ల పక్కన పడేసి వెళుతున్నారు. కొంత మంది రైతులు ర్యాంపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. చాలా ప్రాంతాల్లో రైతులు కాయలు కోయకుండా చెట్లలోనే వదిలేస్తున్నారు. మామిడి రైతులు పడుతున్న కష్టాలు చూసి వ్యాపారులు తోతాపురి కేజీ రూ.2 నుంచి రూ. 3 చెల్లిస్తామని చెప్పడంతో రైతన్నలు దానికి కూడా పోటీ పడాల్సిన పరిస్థితి వచ్చింది. మామిడి పంట ఆరంభం నుంచే ధరలు విపరీతంగా పడిపోతున్నా ప్రభుత్వం ముందు చూపు లేకపోవడంతో సగానికి పైగా మామిడి పంట పొలాల్లోనే ఆగిపోయిందని బాధిత రైతులు గగ్గోలు పెడుతున్నారు.

సిండి'కేటు'తో సమస్య

మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు, వ్యాపారులు, దళారీలు సిండికేట్ కావడంతో తోతాపురిని అమ్ముకోలేక రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల్లో టన్ను తోతాపురి రూ.8కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా అది ఎక్కడా అమలు కావడం లేదు. తోటల్లో పక్వానికి వచ్చిన కాయలను ఎలాగోలా ర్యాంపుల వద్ద కొనాలని దళారీలను రైతులు బతిమాలుకుంటున్నారు. దీంతో దళారీలు రూ.3కు కొనుగోలు చేసి గుజ్జు పరిశ్రమలకు రూ.6తో సరఫరా చేస్తున్నారు. ఇలా ఫ్యాక్టరీ యజమానులు, దళారులు, వ్యాపారులు సిండికేట్ కావడంతో రైతుల కడుపు మండుతోంది. మరోవైపున ర్యాంపు యాజమాన్యాలు లాభాలు ఆర్జిస్తున్నా రైతులకు కోత కూలీ, రవాణా ఖర్చులు కూడా రావడం లేదు.

అప్పుడు రూ.8.. ఇప్పుడు రూ.3

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నానితో పాటు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు అందరూ దామలచెరువు మ్యాంగో మార్కెట్‌కు వెళ్లి తోతాపురి ఒక కిలో రూ.8 కచ్చితంగా ఇవ్వాల్సిందే.. ఆపై రూ.4 ప్రభుత్వం నేరుగా రైతులకు ఇస్తుందని హుకుం జారీ చేశారు. ర్యాంపులు వద్ద కూడా అలాగే ధరలు పెట్టాలని ఒత్తిడి చేశారు. దీంతో ర్యాంపుల వద్ద కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారులు పత్తా లేకుండా పారిపోవడంతో ర్యాంపులు అన్నీ మూత వేయాల్సి వచ్చింది. ఇక మండీల నుంచి ఎగుమతులు చేసే వ్యాపారులు సైతం బాగా కలర్ ఉన్నా కాయలకు రూ.6 చెల్లించి పచ్చగా వున్న వాటికి రూ.4 చెల్లిస్తూ వచ్చారు. ర్యాంపులు మూసివేయడంతో మండీల వద్దకు మామిడి పంటను అధికంగా తీసుకు రావడంతో నాలుగు రోజులుగా కిలో రూ.3కు కొనుగోలు చేస్తూ అంతకు మించి ఇవ్వలేమని తేల్చి చెబుతున్నారు. అది కూడా మూడు నెలల తరువాత చెల్లిస్తామని చెబుతున్నారు. దీంతో రైతులు సరుకు అప్పగించి వ్యాపారి రాసిచ్చిన చీటి చేతబట్టుకుని ఒట్టి చేతులతో ఇంటి ముఖం పడుతున్నారు.

అప్పుడు చెరకు.. ఇప్పుడు మామిడి

గతంలో చెరకు పంట విస్తారంగా సాగు చేస్తున్న రైతుల నుంచి నల్లబెల్లం కొనుగోలు చేయరాదని చంద్రబాబు సర్కారు నిషేధం పెట్టడంతో రైతులకు చెరకు పంటను దూరం చేశారు. ఆ తరువాత పాడి రైతులపై ఆధారపడి బతుకుదామంటే హెరిటేజ్ సంస్థను తెరమీదకు తెచ్చి ప్రభుత్వ పాల డెయిరీలను మూత వేయించి పాల ధరలను తగ్గించేశారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. తాజాగా మామిడికి సరైన గిట్టుబాటు ధర కల్పించలేక, ఫ్యాక్టరీలను తెరిపించలేక చేతులు ఎత్తేయడంతో మామిడి రైతులు రోడ్డున పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో మామిడి రైతులు ఆర్థిక కష్టాలు రెట్టింపు అయ్యాయని ఆవేదన చెందుతున్నారు.

కడుపు మండి చెట్లు నరికివేత

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పోటుగనుమ గ్రామానికి చెందిన రైతు నాగరాజ నాయుడు మామిడి పంటను దామలచెరువుకు తీసుకువెళ్లగా అడిగేవారు లేరు. తన మూడు ఎకరాల మామిడి తోటలో నుంచి 6 టన్నుల తోతాపురి మామిడి పంటను అమ్మకానికి తీసుకెళ్లగా ఎవ్వరూ కొనుగోలు చేయకపోవడంతో రోజంతా అక్కడే పడిగాపులు పడ్డాడు. ఆ తరువాత ఎంతో కొంత ఇచ్చేసి తీసుకోవాలని వ్యాపారులను ప్రాధేయపడటంతో డబ్బు ఇప్పుడు ఇవ్వలేమని రూ.3 లెక్కన సరుకు దించి వెళ్లాలని ఆ వ్యాపారి చీటి రాసిచ్చాడు. ఆ చీటి తీసుకుని ఇంటిముఖం పట్టిన రైతు నాగరాజనాయుడు చేతి నుంచి రవాణా ఖర్చులు, కూలీలు సుమారు 13 వేలు చెల్లించాల్సి వచ్చింది. కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేక, ఖర్చులు భరించలేక ఆ చెట్లు ఎందుకన్న కోపంతో గొడ్డలి తీసుకువెళ్లి మొదళ్లకు నరికి వేశారు. బిడ్డలా పెంచుకున్న మామిడి మొక్కలను చేజేతులా నరికేయాల్సిన పరిస్థితి తెచ్చిన చంద్రబాబు ప్రభుత్వాన్ని విమర్శలతో దుమ్మెత్తిపోశాడు. అలాగే గంగాధర నెల్లూరు నియోజకవర్గం కొత్తపల్లి మిట్టకు చెందిన రైతు మనోహర్‌రెడ్డి తన మామిడి పంటను బీడు భూమిలో పడేశారు.



ఎగుమతులు లేక మండీల్లోనే మగ్గుతున్న తోతాపురి మామిడి కాయలు



మూసివేయడంతో బోసిగా కనిపిస్తున్న ర్యాంపు



మామిడి మండీల వద్ద అన్‌లోడ్ చేయకుండా రెండు రోజులుగా నిరీక్షిస్తున్న వాహనాలు

ఐజర్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కోహ్లీ



ఏర్పేడు : మండలంలోని జంగాలపల్లి సమీపంలో ఉన్న తిరుపతి ఐజర్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లీ నియమితులయ్యారు. విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని ఐజర్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆయనను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. రాజమండ్రిలో పుట్టి పెరిగిన ఆయన అక్కడే పీజీ వరకు విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. ఆయన న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్‌లో పనిచేశారు. అయితే సొంత రాష్ట్రంలో సేవ చేయాలనే కాంక్షతో ఆయన స్వచ్ఛందంగా తన కేంద్ర ప్రభుత్వ పదవిని వదులుకుని తిరుపతి ఐజర్‌లో చేరారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్య, సాంకేతిక సంస్థల అనేక ఉన్నత స్థాయి కమిటీలలో రిసోర్స్ పర్సన్, నిపుణ సభ్యుడిగా పనిచేస్తున్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఐజర్ పాలనా చక్రాన్ని, సంస్థాగత నైపుణ్యాన్ని మరింత బలోపేతం చేసి, దేశంలోనే దీటైన ఐజర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

చెవిరెడ్డి అరెస్టుపై ప్రవాసాంధ్రుల నిరసన

తిరుపతి రూరల్ : చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టుపై ప్రవాసాంధ్రులు మండిపడ్డారు. ఏపీలో కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు పరాకాష్టకు చేరాయన్నారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరానికి చెందిన ప్రవాసాంధ్రులు శుక్రవారం 'వి సపోర్ట్ చెవిరెడ్డి' అన్న ఫ్లెక్సీలను చేతపట్టుకుని నిరసన తెలిపారు. చెవిరెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సిడ్నీ నగరం నుంచి ఆయన వెంట మేముంటామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సిడ్నీ నగర కన్వీనర్ అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. ఏపీలో కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం అరాచకాలకు, అక్రమాలకు పాల్పడుతోందన్న విషయం ఆస్ట్రేలియాలో కూడా తెలిసిందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకంలో భాగమే చెవిరెడ్డి అక్రమ అరెస్టుగా భావిస్తున్నామన్నారు. నిరసనలో రాజ్‌బద్ధం, వివేక్ కొల్లేపల్లి, మనోహర్, గోపాల్, చంద్ర, మహేంద్ర, జనార్దన్ పాల్గొన్నారు.



ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో చెవిరెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తున్న ప్రవాసాంధ్రులు

బదిలీలపై ఆగ్రహం

- పునఃసమీక్షించాలని సచివాలయ ఉద్యోగుల డిమాండ్
- జీవో నంబర్ 5ను సవరించాలని ఆందోళన
- సొంత మండలాల్లోనే బదిలీ చేయాలంటూ నిరసన
- భారీ ర్యాలీతో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా



తిరుపతి తుడా : గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వీటిపై అధికారులు పునఃసమీక్షించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు సమస్యలతో కూడిన ఫ్లకార్డులు చేతబూని నిరసన తెలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల సచివాలయ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం చేపట్టిన బదిలీ ప్రక్రియ దారుణంగా ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులకు బదిలీలు సొంత మండలం, మున్సిపాలిటీ, కార్పొరేషన్ నందు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే జీవో నంబర్ 5ను సవరించాలన్నారు. వార్డు గ్రామస్థాయి అధికారులను సొంత మండలాల్లో పనిచేయకూడదనే నిబంధన సమంజసం కాదన్నారు. ఇంక్రిమెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు నీలకంఠేశ్వర్ విద్యాసాగర్, సురేష్, లోకేష్, నాగమోహన్, నవీన్, నరేంద్ర, సుధారాణి, లక్ష్మీప్రియ, గీత, మణెమ్మ, లావణ్య, స్వాతి, రూపాదేవి, కవిత, సరస్వతి, దాణిక్య, తేజస్విని, పూర్ణిమ, నేతాజీ, అలీ అక్బర మురళి మస్తానప్ప జైపాల్ నాయక్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు



కార్పొరేషన్ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఆందోళనకు గురవుతున్నాం



గ్రామ, వార్డు సచివాలయ సెక్రటరీలు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఏడాది కాలంగా వివిధ సర్వేలతో తీవ్ర ఒత్తిడికి బదిలీల జీవో మరింత ఇబ్బందికరంగా మారింది. సెక్రటరీల కుదింపుతో మరింత విధుల భారం పెరిగే అవకాశం ఉంది. మా డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి. వలంటీర్లు చేస్తున్న పనులను సచివాలయ ఉద్యోగులే చేస్తున్నాం. డీఏ, ఆర్‌బలను వెంటనే మంజూరు చేయాలి.

–కోటేశ్వరరావు , సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

బదిలీ జీఓను సవరించాలి



సచివాలయ సెక్రటరీల బదిలీల జీఓను ప్రభుత్వం వెంటనే సవరించాలి. జీఓ నంబర్ 5 వల్ల ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాం. బదిలీల నిబంధనలో మార్పులు తీసుకురావాలి. బదిలీలకు సంబంధించి సెక్రటరీల అభిప్రాయాలు తీసుకునేందుకు అధ్యయన కమిటీ వేయాలి. మా అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే బదిలీలకు ప్రభుత్వం మొగ్గు చూపాలి.

–విద్యాసాగర్, సచివాలయ ఉద్యోగుల సమైక్య తిరుపతి శాఖ అధ్యక్షుడు


కుటుంబాలను ఇబ్బంది పెట్టడమే



ఇతర ప్రాంతాల్లో సెక్రటరీలు పని చేయాల్సి వస్తే కుటుంబాలు ఇబ్బందులు పడాల్సిందే. ప్రస్తుతం ఇస్తున్న జీతాలతో కుటుంబం మరో ప్రాంతానికి వెళ్లి ఉద్యోగాలు చేయడం ఎలా సాధ్యమవుతుంది. ప్రభుత్వం మా కుటుంబాలపై సానుకూలంగా స్పందించాలి. సొంత మండలాల్లోనే పనులు చేసేలా సహకరించాలి.

–కవిత, మహిళ సెక్రటరీ

సొంత మండలాల్లో అవకాశం కల్పించాలి



బదిలీల జీఓ నంబర్ 5ను సవరించి సొంత మండలం, సొంత మున్సిపాలిటీ పరిధిలోని బదిలీలకు అవకాశం కల్పించాలి. సొంత మండలాల్లో పనిచేయకూడదు అనే నిబంధన సరైంది కాదు. చాలీచాలని జీతాలతో కుటుంబాలతో కలిసి మరో ప్రాంతానికి వెళ్లి పనిచేయడం అసాధ్యం.

–నరేంద్ర, సచివాలయ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

బస్సు ఢీకొని ఒకరి మృతి

తిరుపతి క్రైమ్ : ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిస్సాకు చెందిన మొహిద్దిన్(33) రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పూర్ణకుంభం సర్కిల్ వద్ద ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మొహిద్దిన్ ను స్థానికుల సహాయంతో హుటాహుటిన రుయా హాస్పిటల్ తరలించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

కిందపడి విద్యార్థి మృతి


మృతి చెందిన సాల్మన్

చంద్రగిరి : ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలైన విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. మండల పరిధిలోని రాయలపురం పంచాయతీకి చెందిన బాలకృష్ణ, అనురాధ దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. చివరి కుమారుడు సాల్మన్(13) 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి ఇంటి వద్ద ఆడుకుంటూ సాల్మన్ ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో బాలుడికి మూర్ఛ రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సాల్మన్ మృత్యువాత పడ్డాడు. కళ్లెదుట ఆడుకుంటున్న కన్నబిడ్డ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 20 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 20 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు కానిస్టేబుల్ శివుడు తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు తిరుపతి నగరంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు పేర్కొన్నారు.

చార్జీల బాదుడు

- టోల్ గేట్ పేరుతో బస్సుల్లో అదనపు వసూలు
- తిరుపతి–శ్రీకాళహస్తి బస్సు చార్జీలమోత
- టికెట్‌పై రూ.10 పెంపు
- ప్రయాణికులపై అదనపు భారం


శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి మేర్లపాక టోల్‌గేట్ వద్ద వస్తున్న మెట్రో సర్వీస్

తిరుపతి అర్బన్ : జిల్లాలో తిరుమల తర్వాత ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరొందిన శ్రీకాళహస్తి దేవస్థానానికి నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. తిరుపతికి వచ్చే భక్తులు తిరుమల, తిరుచానూరు దర్శనం అనంతరం శ్రీకాళహస్తికి వెళుతుంటారు. అయితే ఆర్టీసీ అధికారులు తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే సర్వీసుల్లో చార్జీలు పెద్ద ఎత్తున పెంచేశారు. దీంతో పలువురు ప్రయాణికులు మండిపడుతున్నారు.

తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలోని ఏర్పేడు సమీపం మేర్లపాక వద్ద ఇటీవల టోల్‌గేట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఈ మార్గంలో నడుస్తున్న ఆర్టీసీ చార్జీలను టిక్కెట్ ధరపై ఏకంగా రూ.10 పెంచేశారు. దీంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. ఆర్టీసీ టోల్‌గేట్ చెల్లించే దాని కంటే రెట్టింపు ధరలు చార్జీల ద్వారా గుంజేస్తున్నారని పలువురు ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

ఆర్టీసీ టోల్‌గేట్‌లో రూ. 705 చెల్లించాల్సి ఉంది.

తిరుపతి నుంచి ఓ ఆర్టీసీ సర్వీసు శ్రీకాళహస్తికి వెళ్లడానికి రూ.470, తిరిగి రావడానికి రూ.235 చెల్లించాలి. మొత్తంగా రూ.705 టోల్‌గేట్‌లో ఒక ఆర్టీసీ సర్వీస్ చెల్లించాల్సి ఉంది. అయితే ఆర్టీసీ సర్వీసులో 46 సీట్లు ఉన్నాయి. ఒక టిక్కెట్‌పై రూ.10 పెంచారు. దీంతో ఒక ట్రిప్పునకు రూ.460 ఆర్టీసీకి వస్తుంది. మరో ట్రిప్పునకు రూ.460 వస్తుంది. మొత్తంగా రెండు ట్రిప్పులకు రూ.920 వస్తుంది. అయితే రెండు ట్రిప్పులకు ఆర్టీసీ టోల్‌గేట్‌లో చెల్లించేది రూ.705 మాత్రమే. ఈ క్రమంలో ఆర్టీసీకి అదనంగా రూ. 215 మిగులుతుంది. టోల్‌గేట్ ఏర్పాటు చేస్తే ఆ చార్జీలను ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. అలా కాకుండా కూటమి సర్కార్‌లో ప్రయాణికులపై అదనపు భారాన్ని చార్జీలు పెంచి వసూళ్లు చేయడంపై పలువురు మండిపడుతున్నారు.

శ్రీకాళహస్తి డిపో నుంచి 8 మెట్రో సర్వీసులు విశాఖకు తరలింపు

తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండడం కోసం గాలి, వెలుతురు వచ్చేలా ఉండే మెట్రో సర్వీస్‌లను గతంలో 32 ఏర్పాటు చేశారు. అయితే వాటిలో 8 సర్వీసులు మరమ్మతుకు గురికావడంతో 24 సర్వీసులు తిరుగుతుండేవి. వాటిలో తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి చార్జీ రూ.55 మాత్రమే. అయితే మూడు నెలల కిందట మెట్రో సర్వీస్‌లు విశాఖపట్నంలో టౌన్ సర్వీస్‌లకు అనుకూలంగా ఉంటాయని శ్రీకాళహస్తి డిపో నుంచి విశాఖపట్నానికి పంపించారు. వాటి స్థానంలో 8 అల్ట్రా డీలక్స్ సర్వీస్‌లను ఏర్పాటు చేశారు. మెట్రో సర్వీస్‌లో టిక్కెట్ ధర రూ.55 ఉంటే...అల్ట్రా డీలక్స్‌లో టిక్కెట్ ధర రూ.70 చేశారు. దీంతో ప్రయాణికులు తమకు మెట్రో సర్వీసులు ఎంతో అనుకూలంగా ఉండేవని....వాటి స్థానంలో అల్ట్రా డీలక్స్‌లను ఏర్పాటు చేసి...టిక్కెట్‌పై రూ.15 పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా ఆర్టీసీ వాటిని పట్టించుకోకుండా చార్జీలను అలానే కొనసాగిస్తోంది. తాజాగా అల్ట్రాడీలక్స్‌లో టోల్‌గేట్ పేరుతో రూ.5 పెంచారు. మొత్తంగా తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి అల్ట్రా డీలక్స్‌లో వెళ్లాలంటే టిక్కెట్ ధర రూ.75 చెల్లించాల్సి ఉంటుంది.

టోల్‌గేట్‌లో తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో పెంచిన చార్జీలు

సర్వీస్	పాత చార్జీలు	కొత్తగా చార్జీలు (రూ.లలో)
మెట్రోసర్వీస్	55	65
ఎక్స్‌ప్రెస్	55	65
పల్లెవెలుగు	45	55
ఆర్డినరీ సర్వీస్‌లు	45	55
అల్ట్రాడీలక్స్	70	75

నష్టం వస్తుందని..



తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో తిరుగుతున్న సర్వీస్‌ల్లో టిక్కెట్ ధరపై రూ.10 పెంచాం. అయితే అల్ట్రా డీలక్స్ మాత్రం టిక్కెట్ ధరపై రూ. 5 పెంచాం. ఒక సర్వీస్ శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళ్లి రావడానికి రూ.705 టోల్ గేట్ కట్టాల్సి ఉంది. ఒక సర్వీస్‌లో 45 లేదా 46 సీట్లు ఉంటే రెండు ట్రిప్పులకు టిక్కెట్ ధర పెంచడం ద్వారా రూ.900 నుంచి 920 వస్తుంది. అయితే అన్ని సీట్లు...అన్ని ట్రిప్పులు భర్తీ కావడం లేదు. ఈ క్రమంలోనే టిక్కెట్ ధర రూ.10 చేయాల్సి వచ్చింది. టిక్కెట్‌పై రూ.10 పెంచకపోతే ఆర్టీసీకి నష్టం వస్తుంది.

– మునిచంద్ర, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్

తల్లీ.. కూటమికి కనువిప్పు కలిగించు!

- రాహుకాల పూజల్లో చెవిరెడ్డి లక్ష్మి


ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్ : 'అమ్మా.. చాముండేశ్వరీ.. కుట్రలు, కుతంత్రాలు, కక్షలతో కళ్లు మూసుకుని పరిపాలన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించు తల్లీ.. నీ బిడ్డ చెవిరెడ్డిని రాజకీయ కక్షతో అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపారు.. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు మనోధైర్యం కలిగించు.. తల్లీ..' అంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి అమ్మవారిని వేడుకున్నారు. తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటలోని శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే రాహుకాల పూజల్లో చెవిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు. ఆమె చేత అమ్మవారికి శాంతి పూజలు, హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో తుమ్మలగుంటకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యువతకు వెన్నుపోటు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, నగర అధ్యక్షుడు దినేష్ రాయల్‌తో పాటు పార్టీ నాయకులు, యువత

- ఎన్నికల్లో యువతకు కూటమి ఇచ్చిన హామీలు గాలికి
- 23న కలెక్టర్ కార్యాలయం వద్ద హామీల అమలుకు 'యువత పోరు'

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువత భవిష్యత్తు అంధకారంగా మారిందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఈనెల 23న పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ మాట్లాడుతూ.. కూటమి ఏడాది పాలనలో యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చిన పాపానపోలేదని మండిపడ్డారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో మాయమాటలు చెప్పి యువతను మోసగించి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్షల ఉద్యోగాలు ఇస్తామని, రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ యువతకు వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు వైఎస్సార్‌సీపీ యువత పోరు చేపడుతోందన్నారు. యువత పోరు కార్యక్రమంలో భారీగా యువత పాల్గొని కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లం రవికుమార్‌రెడ్డి, రూపేష్, రమణ, సుధార్, పసుపులేటి సురేష్, చరణ్, జాషువా, పవన్, ఓబుల్‌రెడ్డి, చంగల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, యశ్వంత్, వినోద్ తిరుమలరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం


నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విశ్వం విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన 2వ జాబితా ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అర్హత సాధించి ప్రభంజనం సృష్టించినట్లు తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.హృతిక్ రాయల్, సలాడీ భువనేష్, ఎం.నిహాంత్ కుమార్, డి.మహిదర్‌తో పాటు మొత్తం 54 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించారని తెలిపారు. గత 35 ఏళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ తదితర పోటీ పరీక్షలకు ఉత్తమ ప్రమాణాలతో కూడిన అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. దీంతో తమ విద్యార్థులు ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశం సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అభినందించారు. వచ్చే ఏడాదికి నిర్వహించే పోటీ పరీక్షలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కడుపు మండి.. రోడ్డుపై పోసి


మామిడి కాయలను పారబోసిన రైతులు

పాకాల : రోజురోజుకి మామిడి రైతులు కన్నీటి వ్యథ అధికమవుతోంది. మామిడికి గిట్టుబాటు ధర హామీ నెరవేరక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నీటిపై రాసిన రాతలుగా మారడంతో రైతులు విస్తుపోతున్నారు. కేవలం రూ.3లకు కొనుగోలు చేస్తూ ర్యాంపు నిర్వాహకులు, సప్లయర్లు రైతులను దగా చేస్తున్నారు. శుక్రవారం కొన్ని ర్యాంపులను తెరిపించి రైతుల వద్ద మామిడిని కొనుగోలు చేయడానికి టోకెన్లను ఇప్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్, ఆర్డీఓ రామ్మోహన్, డీహెచ్‌ఓ దశరథరామిరెడ్డి, సీఐ సుదర్శన్‌ప్రసాద్, ఉద్యానశాఖ అధికారిణి శైలజ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీ సానుభూతిపరుడి అరెస్టు

- ఉపాధి పనుల్లో అవినీతిని ప్రశ్నించినందుకా..?
- అర్ధరాత్రి వరకు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధం


భాకరాపేట పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న వైఎస్‌ఆర్‌సీపీ నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి నియోజకవర్గంలో గత ఏడాది కాలంగా ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల్లో అవినీతిని సమాచార హక్కు చట్టం ద్వారా బయటకు తీసి అధికారులకు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసిన వైఎస్‌ఆర్‌సీపీ సానుభూతిపరుడిపై కక్ష పెట్టుకున్న స్థానిక టీడీపీ నేతలు పోలీసుల ద్వారా శుక్రవారం అరెస్టు చేయించారు. బాధితుని కుటుంబీకుల సమాచారం మేరకు.. ఎర్రావారిపాళెంకు చెందిన అరవింద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇతను వైఎస్‌ఆర్‌సీపీకి సానుభూతి పరుడు. తన గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిని ఢిల్లీ స్థాయికి చేర్చడంతో స్థానిక నేతలు అతనిపై కక్షకట్టారు. రెండు రోజుల క్రితం కుప్పంలో అప్పు కట్టనందుకు ఓ మహిళను చెట్టు కట్టేసిన వార్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అదే పోస్టును అరవింద్ కూడా తన వాట్సాప్ గ్రూపులో షేర్ చేశాడు. దీనిపై అదే మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఫిర్యాదు చేయగా పోలీసులు అతనిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఆ విషయం తెలుసుకున్న వైఎస్‌ఆర్‌సీపీ నేతలు భాకరాపేట పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని సీఐని ప్రశ్నించగా సీఎంను కించపరిచేలా పోస్టు పెట్టినందుకు కేసు నమోదు చేస్తున్నామని వివరించారు. అయితే 41సి నోటీసు ఇవ్వాల్సిన కేసులో నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఎలా నమోదు చేస్తారని న్యాయవాది ప్రశ్నించడంతో పోలీసులు నుంచి ఏలాంటి సమాధానం రాలేదు. దీంతో ఎర్రావారిపాళెం మండల వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు చెంగల్‌రెడ్డి, సన్ని, హరినాథరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెంగల్ రెడ్డి, చిన్నగొట్టిగల్లు మండలం వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు సింహాల మోహన్, హరినాథ్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసుల తీరును తప్పుబట్టారు. బెయిలబుల్ సెక్షన్లు పెట్టాల్సిన కేసులో నాన్ బెయిలబుల్ కేసు పెట్టి చట్ట ఉల్లంఘనకు పాల్పడ్డ పోలీసులపై కోర్టులో కేసు వేస్తామని వైఎస్‌ఆర్‌సీపీ నేతలు, అతని కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

అంకిత భావంతో పనిచేద్దాం : కలెక్టర్

తిరుపతి అర్బన్ : రెవెన్యూ ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్, రాష్ట్ర సెక్రటరీ అశోక్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. వన్ ఫైల్, వన్ లైఫ్ అనే నినాదంతో రెవెన్యూ శాఖ పనిచేయాలని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ.. రెవెన్యూకు సంబంధించిన సమస్యలన్నింటిని రెవెన్యూ సిబ్బంది ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా ప్రతి ఒక్కరూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్, రాష్ట్ర సెక్రటరీ అశోక్‌రెడ్డి పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్, శివశంకర్ నాయక్, ల్యాండ్ అండ్ సర్వే శాఖ అధికారి అరుణ్ కుమార్, సిపిఓ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డీఆర్‌ఓ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిశాఖలోనూ మహిళా కమిటీలు

- రెండో రోజు కలెక్టరేట్‌లో మహిళా కమిషన్ సభ్యుల సమీక్ష

తిరుపతి అర్బన్ : ప్రతి శాఖలోనూ అంతర్గత మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్ ఆదేశించారు. రెండో రోజు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలసి అధికారులతో సమీక్షించారు. ప్రాథమిక దశలోనే శాఖల సమన్వయంతో పనిచేస్తే మహిళా సమస్యలకు సులభంగా పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పని చేసే ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న నేరాలను నిరోధించాలంటే ప్రభుత్వ ప్రైవేటు సెక్టార్లకు సంబంధించిన యాక్ట్‌ను పటిష్టం చేయాలన్నారు. మహిళలపై నేరాలు ఎక్కువ కావడానికి కారణం సరైన అవగాహన లేకపోవడం, భద్రత కలిగించకపోవడం ప్రధాన కారణమని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. జాతీయ మహిళా కమిషన్ సూచనలు క్రమం తప్పకుండా పాటించి లైన్ డిపార్ట్‌మెంట్ సహకారంతో జిల్లాలో మహిళల పై జరుగుతున్న నేరాలను అరికట్టే దిశగా కృషి చేస్తామని తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికడతామన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ.. మహిళలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేస్తామని వివరించారు. మహిళా కమిషన్ మెంబర్ రోఖాయా బేగం, మహిళా పోలీస్ డీఎస్పీ శ్రీలత, కృష్ణకుమారి జాయింట్ డైరెక్టర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వసంత భాయి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- పనులను పరిశీలించిన కేంద్ర బృందం

నారాయణవనం : ఉపాధి పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలని కేంద్ర బృంద సభ్యులు సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను కేంద్ర బృంద సభ్యులు స్వాగత్ దాస్, సుమన్ మజుందార్, సుబన్ దానే, రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖ కుమార్‌తో పాటు జిల్లా పీడీ శ్రీనివాస ప్రసాద్ క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. మండలంలో ఎరికంబట్టు, కొండలచెరువు అటవీ ప్రాంతంలో పనులను చూశారు. మండలంలో ఉపాధి పథకంలో నిర్మించిన సీసీ రోడ్లు, ఫారం పాండ్లను, పశువుల నీటి తొట్లను, మురుగు కాలువలను తనిఖీ చేశారు. ఆయన వెంట పుత్తూరు ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీవో అరుణ, ఏపీఓ సుకన్య , ఈసీ భాగ్యలక్ష్మి, మమత, టీఏలు సారధి, గాంధి, సుదర్శన్ పాల్గొన్నారు.

పుత్తూరు సిద్ధార్థలో గ్రాడ్యుయేషన్ డే


యువ ఇంజినీర్‌కు గోల్డ్ మెడల్ అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, అశోకరాజు

నారాయణవనం: పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు, వోల్వో గ్రూప్ రిటైర్డ్ డైరెక్టర్ ఇందు శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని పాస్ అవుట్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మెడల్స్‌ను, పట్టాలు అందజేశారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన కాన్వొకేషన్ డే సమావేశంలో కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యను అందించడానికి సిద్ధార్థ గ్రూప్ కళాశాలలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు మాట్లాడుతూ తోటి వారితో పోటీ పడి సృజనాత్మక, ఇన్నోవేటివ్ విద్యపై శ్రద్ధ చూపాలన్నారు. సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 903 మంది, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 485 మందికి డిగ్రీ కాన్వొకేషన్లు అందజేశారు. 2024–25లో విద్యా సంవత్సరానికి సంబంధించి 17 మంది విద్యార్థులకు గోల్డ్ మెడళ్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

శ్రీకాళహస్తిలో డ్రగ్స్ కలకలం


సిరంజిలు, బీడీలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని రెండవ పట్టణంలో డ్రగ్స్ కలకం సృష్టిస్తోంది. ఏపీఆర్ పాఠశాల వెనుక ఐదుగురు యువకులు ప్రతిరోజూ మద్యం సేవించి గొడవ పడుతుండడాన్ని గమనించిన స్థానికులు శుక్రవారం సాయంత్రం వారిని తరిమేయడానికి ప్రయత్నించారు. వారు పారిపోయారు. ఒక యువకుడు ద్విచక్ర వాహనాన్ని వదిలేసి వెళ్లిపోవడంతో దాన్ని రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు. తీరా అక్కడ పరిశీలించగా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు తేలింది. డ్రగ్స్ బాటిళ్లు, సిరంజీలు, గంజాయి బీడీలు కనిపించడంతో అవాక్కయారు. శ్రీకాళహస్తిలో గంజాయి, మద్యం మాత్రమే దొరుకుతుందని అనుకున్న స్థానికులు శుక్రవారం డ్రగ్స్ బాటిళ్లను చూసి భయపడుతున్నారు. దీనిపై రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డిని వివరణ కోరగా స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లగా వారి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వాహనం ఎవరి పేరుతో ఉందో తెలుసుకుని అదుపులోకి తీసుకుంటామని వెల్లడించారు.

విషాద యాత్ర

- అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు
- ఒకే కుటుంబంలో ఇద్దరి మృతి
- బాధితులది తిరుపతి జిల్లా


దెబ్బతిన్న కారు


మస్తాన్ సాహెబ్, ఆయేషా మృతదేహాలు

కొడవలూరు(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఓ బాలిక, ఓ వృద్ధుడు మృతిచెందారు. ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని రాచర్లపాడు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా భాకరాపేటకు చెందిన మహబూబ్‌బాషా కుటుంబం పదిమంది కారులో హైదరాబాద్ యాత్రకు వెళ్లింది. తిరిగి అదే కారులోనే సొంతూరికి బయలుదేరారు. కొడవలూరు మండలం రాచర్లపాడు సమీపంలో వస్తుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మస్తాన్ సాహెబ్ (67) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయేషా (11) అనే బాలిక తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయింది. కారు నడుపుతున్న మహబూబ్‌బాషాతోపాటు లోపల ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే మొబైల్ సిబ్బంది చొరవతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారికి ప్రాణాపాయ పరిస్థితి లేదని వైద్యులు తెలిపినట్లు ఎస్సై కోటిరెడ్డి వెల్లడించారు. కారు నడుపుతున్న వ్యక్తి నిద్ర మత్తు కారణంగా అదుపుతప్పి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.